క్లుప్తంగా

పెన్నానదికి నీటి విడుదల

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశారు. మంగళవారం ఉదయం పెన్నానది పరివాహక గ్రామాలకు తాగునీటి అవసరాల నిమిత్తం 317 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ప్రస్తుతం మైలవరం జలాశయంలో 3.5 టీఎంసీల నీరు ఉన్నట్లు మైలవరం ఈఈ యు. రమేష్ తెలిపారు.

మే డేను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : ప్రపంచ కార్మిక దినోత్సవం మే డేను జయప్రదం చేయాలని మంగళవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో పోస్టర్లను ఏఐటీయూసీ నాయకుడు ఎంవా సుబ్బారెడ్డి విడుదల చేసి మాట్లాడారు. మేడే కార్యక్రమాన్ని ఎర్రగుంట్లలో ఘనంగా నిర్వహించబోతున్నామని కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్, ఎం.నారాయణ తదిరులు పాల్గొన్నారు.

అగడూరులో సివిల్ ర్యాంకర్‌కు ఘన స్వాగతం



శ్రీసీతారామాలయంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో సివిల్ ర్యాంకర్ శివగణేష్‌రెడ్డి

తొండూరు : సివిల్స్‌లో ఆలిండియా 119వ ర్యాంకు సాధించిన శివగణేష్‌రెడ్డికి అమ్మమ్మ ఊరైన అగడూరు గ్రామస్తులు మంగళవారం గ్రామానికి రాగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ డైరెక్టర్ శివశంకర్‌రెడ్డి, అవ్వ కొప్పల ఈశ్వరమ్మ, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బస్టాఫ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన శ్రీసీతారాముల ఆలయంలో గ్రామస్తులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివగణేష్‌రెడ్డి మాట్లాడుతూ సివిల్స్‌లో ర్యాంకు సాధిస్తే పూజలు చేస్తానని మొక్కుకున్నానన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో మొదటి ప్రైజ్



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ సునీత

వల్లూరు (చెన్నూరు) : సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఏప్రిల్ 21, 22, 23 తేదీలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో చెన్నూరు మండలం భవిత సెంటర్ విద్యార్థి బి.సుబ్బారెడ్డికి మొదటి బహుమతి లభించింది. 100 మీటర్ల రన్నింగ్‌లో మొదటి బహుమతిని గెలుపొందగా 200 మీటర్ల రన్నింగ్‌లో మూడో బహుమతిని సాధించాడని మండల విద్యాశాఖ అధికారి సునీత, జేఈఆర్టీలు టి.శ్రీదేవి జె.కళావతి సుబ్బారెడ్డిని అభినందించారు.

చిన్నకుడాలలో రీసర్వే



భూ రీసర్వేలో భాగంగా డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

లింగాల : మండలంలోని చిన్నకుడాల గ్రామంలో భూ రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంగళవారం తహసీల్దార్ ఈశ్వరయ్య, సర్వేయర్ పార్వతి, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు సర్వేకు సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించారు. కార్యక్రమంలో చిన్నకుడాల గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

పులివెందుల టౌన్: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న మెప్మా కార్యాలయంలో బుధవారం ఉదయం ఆదిత్య బిర్లా గార్మెంట్స్ లిమిటెడ్ కంపెనీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు మహిళలు మాత్రమే అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 7780376816 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని వారు కోరారు.

ఉపాధి అవకాశాలు పెంచేందుకే ట్రయల్ రన్

ప్రొద్దుటూరు కల్చరల్ : యువతలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేందుకు జక్క జ్యోతి ఫుడ్స్ ప్రొడక్ట్స్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ప్రొద్దుటూరులో ఫుడ్స్ సీఈఓ జక్క పెద్దన్న తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కొర్రపాడు రోడ్డులోని తమ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఉపాధి, ఉద్యోగాల కోసం 100 రోజుల పీ4 ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నారని పేర్కొన్నారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరెప్పుడో..!

- కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పేదలు
- పట్టించుకోని అధికారులు



ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన రేషన్ కార్డులు

సింహాద్రిపురం : కూటమి ప్రభుత్వం రేషన్ కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన 10 నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు ఒక్కరికి కూడా కొత్త రేషన్ కార్డు మంజూరు చేసిన దాఖలాలు లేవు. రేషన్ కార్డుల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సచివాలయ సిబ్బంది చెబుతుండటంతో పేదలు నిరాశగా వెనుతిరుగుతున్నారు. ప్రధానంగా కొత్త రేషన్ కార్డులతోపాటు ఉన్న కార్డుల్లో అనేక తప్పులు దొర్లాయి. ఒకరి ఆస్తి పన్నుకు మరొకరి ఆధార్ కార్డును జత చేశారు. అలాగే ఎటువంటి ఇల్లు లేకుండానే ఉన్నట్లు తప్పుగా నమోదు చేశారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ కార్డులు

అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చి 10నెలలు గడుస్తున్నా రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్డుదారులకు ప్రభుత్వం ప్రతి నెలా బియ్యం, చక్కెర, కందిబేడలు వంటి సరుకులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దరఖాస్తుదారులకు విరివిరిగా రేషన్ కార్డులు అందజేసింది. సచివాలయాలను వేదికగా చేసుకుని గంటల వ్యవధిలోనే రేషన్ కార్డులు ఇచ్చి చరిత్ర సృష్టించింది. అది కూడా వలంటీర్లు అర్హుల ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్డు మంజూరయ్యాక ఇంటి వద్దకే వెళ్లి లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. వైఎస్ జగన్ పాలనలో మధ్యవర్తుల జోక్యం లేకుండా అర్హులకు రేషన్ కార్డులు అందాయి. పారదర్శకతకు పెద్దపీట వేశారు.

ప్రభుత్వ పథకాలు అందడం లేదు



రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఇప్పుడు ప్రతి పథకానికి రేషన్ కార్డు తీసుకుంటున్నారు. రేషన్ కార్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రేషన్ సరుకులు అందడం లేదు. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో కూడా తెలియడం లేదు. గ్రామ సచివాలయం వద్దకు వెళితే ఇంకా మార్గదర్శకాలు రాలేదని చెబుతున్నారు. అసలు రేషన్ కార్డులు ఇస్తారా లేదా అనే అనుమానం వస్తోంది.
– మహమ్మద్ అరిఫ్, స్థానికుడు, సింహాద్రిపురం

ప్రభుత్వం నుంచి ఎలాంటి విధి విధినాలు రాలేదు



కొత్త రేషన్ కార్డు ఇవ్వడానికి ఇంకా ఎలాంటి విధివిధానాలు ప్రభుత్వం నుంచి రాలేదు. వచ్చిన వెంటనే నూతన రేషన్ కార్డులను అర్హులైన వారికి మంజూరు చేయటానికి చర్యలు చేపడుతాం.
– నాగేశ్వరరావు, తహసీల్దార్, సింహాద్రిపురం

వైభవోపేతం ఇంద్రనాథేశ్వరుని కల్యాణం



ఇంద్రనాథేశ్వర స్వామి కల్యాణ క్రతువును నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు : పుష్పగిరి క్షేత్ర ఆలయాల సముదాయంలో భాగమైన ఇంద్రునిచే ప్రతిష్ఠించబడిన చింతలపత్తూరులోని శ్రీ ఇంద్రనాథేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణ మహోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. అవధానం చెంచు సుబ్రమణ్యం స్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేద పండితుల బృందం ఆధ్వర్యంలో ఇంద్రనాథేశ్వర స్వామి, కామాక్షీ దేవి ఉత్సవ మూర్తులను ఆలయ మండపంలోని ప్రత్యేక వేదికపై ఆశీనులను చేశారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని కనులారా వీక్షించారు. అవధానం చెంచు సుబ్రమణ్యం స్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు

చీని ధరలు ధమాల్



ధరలు లేక కుళ్లి పోతున్న చీనీ కాయలు

పులివెందుల రూరల్ : వేసవి కాలంలో చీనీ కాయల ధరలు సాధారణంగా రైతులకు ఆశించిన స్థాయిలో ఉంటాయి. ప్రస్తుతం మార్కెట్‌లో చీనీ కాయల ధరలు అమాంతంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా మార్కెట్‌లో చీనీ కాయల ధరలు టన్ను రూ.30వేల నుంచి రూ.40వేలు ఉంటే వారికి గిట్టుబాటు అవుతుంది. కానీ ప్రస్తుతం మార్కెట్‌లో చీనీ కాయల ధరలు టన్ను రూ.15వేల నుంచి రూ.20వేలు మాత్రమే ఉండటతో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ప్రస్తుతం చీనీ కాయల దిగుబడి బాగున్నా టన్ను చీనీ కాయల ధర రూ.15వేల నుంచి రూ.20వేలకు కొనుగోలు చేసేవారు లేక రైతులు చీనీ కాయలను గుట్టలు గుట్టలుగా పడేస్తున్నారు. ప్రభుత్వం చీనీకి గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతులు, వ్యాపారస్తులు కోరుతున్నారు.

అపరిశుభ్రంగా ఉన్న మార్కెట్

పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న చీనీ కాయల మార్కెట్ ఉంది. పులివెందుల నియోజకవర్గంలోని రైతులందరూ చీనీ కాయలను విక్రయాలు చేసేందుకు మార్కెట్‌కు చీనీ కాయలను తరలిస్తారు. కానీ ఇక్కడ వాడిపోయిన చీనీ కాయలను పక్కకు పడేస్తారు. కానీ మార్కెట్‌ను మాత్రం సంబంధిత మార్కెట్ శాఖ అధికారులు పరిశుభ్రంగా ఉంచకుండా అలాగే వదిలేశారు. చీనీ కాయల లోడు ట్రాక్టర్లతో చీనీ మార్కెట్‌లోకి వస్తే రైతుల దగ్గర నుంచి గేటు వసూలు చేస్తారు, అలాగే మండి వాళ్ళు కూడా కమిషన్ తీసుకుంటారు. కానీ మార్కెట్ మాత్రం అపరిశుభ్రంగా ఉంచారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మార్కెట్ శాఖ అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని రైతులు వాపోతున్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగప్రసాద్

కొండాపురం : వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ లక్ష్మీదేవి అధికారులను ఆదేశించారు. మంళవారం స్థానిక వెలుగు సభాభవనంలో ఆమె అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అనంతరం ఎంపీడీఓ నాగప్రసాద్ మాట్లాడుతూ అజెండలోని వివరాలను అధికారులు వివరించాలన్నారు. బెడుదూరు, కొత్తపల్లె, మురగంపల్లె, వెంకయ్యకాలువ గ్రామాల్లో చేతిపంపులు రిపేరుకు వచ్చాయని మరమ్మతులు చేయాలని పలు మార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని సభలో ఆయా గ్రామ సర్పంచ్‌లు వివరించారు. స్పందించిన ఆర్‌డబ్ల్యూ ఎఈ ప్రసాద్ చేతిపంపులు రిపేరు చేయిస్తానన్నారు. చామలూరు ఎస్సీ కాలనీలో దొబ్బుడుపల్లెలో తాగునీటి సమస్య ఉందని సభ దృష్టికి సర్పంచ్‌లు తీసుకువచ్చారు. అనంతరం రైతులు తప్పకుండా రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకుంటేనే రైతులకు రూ.6 వేలు కేంద్రం ఇస్తున్న పీఎం కిసాన్ పథకం వర్తిస్తుందని మండల వ్యవసాయ అధికారి సభలో వివరించారు. యర్రగుడి పునరావాస కాలనీలో విద్యుత్‌లైట్లు పని చేయలేదని సిబ్బంది పట్టించుకోలేదన్నారు. చామలూరు పునరావాస కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫారంలు వచ్చినా విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్ ఇవ్వలేదన్నారు. టి.కోడూరు గ్రామంలో స్మశాన వాటిక స్థలం లేదని కనీసం పెన్నానదిలోకి వెళ్లేందుకు దారి చూపాలని ఎంపీటీసీ రామమునిరెడ్డి కోరారు. గ్రామంలో కరెంట్ సక్రమంగా ఉండదన్నారు. దొబ్బుడుపల్లెలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు స్పందించడంలేదన్నారు. కార్యక్రమంలో ఉప మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ ప్రసాద్, ఎఓ రామాంజిరెడ్డి, ఎంఈఓ రామయ్య, అధికారులు పాల్గొన్నారు.

సిండికేట్‌తో టీటీడీ ఆదాయానికి గండి



ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహిస్తున్న టీటీడీ అధికారులు

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని టీటీడీ శ్రీ నారాపుర వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే 10వ తేది నుంచి 20వ తేదీ వరకు జరుగనున్నాయి. అయితే వేలంలో సిండికేట్ కావడంతో టీటీడీ ఆదాయానికి గండి పడిందని స్థానికులు చెబుతున్నారు. ఆలయ ఆవరణలో దుకాణాల ఏర్పాటుకు టీటీడీ అధికారులు మంగళవారం ఆలయ ప్రాంగణంలో వేలం పాట నిర్వహించారు. 13 మంది డీడీలు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. టీటీడీ వారి వేలం పాట 10 లక్షల 111 రూపాయలతో ప్రారంభించగా పి.మహీంద్రకుమార్ రూ.10 లక్షల 30 వేలకు దక్కించుకున్నాడు. మిగత వారు సిండికేట్ కావడంతో టీటీడీ అదాయానికి గండి పడింది. 2023వ సంవత్సరంలో జరిగిన బ్రహ్మోత్సవాలకు టీటీడీ అధికారులు నిర్వహించిన వేలం పాటలో రూ.15,10,000 వేలం పాట పోగా ఈ ఏడాది కేవలం రూ.10,30,000 పోవడం గమన్హారం. కాగా వేలంలో పాల్గొన్న వారు గతంలో ఆలయ ప్రాంగణంలో స్థలం ఉండేదని ప్రసుత్తం పెన్సింగ్ వేయడంతో స్థలం తక్కువగా ఉందని చెబుతున్నారు. కార్యక్రమంలో టీటీడీ డీవైఈఓ నటేశ్, టీటీడీ ఏఈ కళావతి, టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హేలాంబ తిరునాల

కమలాపురం : పెద్దచెప్పలిలో వెలసిన శ్రీ హేలాంబ తిరునాల మహోత్సవాలు ముగిశాయి. ఈనెల 23వ తేదీ నుంచి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట రవీంద్ర, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. జిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాయ కర్పూరం సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. సాయంత్రం పుష్పాలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. రాత్రి 10 గంటలకు అశేష భక్త జనసందోహం నడుమ వేద పండితుల మంత్రోచ్ఛారణలతో అమ్మవారికి కంకణం విప్పారు. దీంతో తిరునాల మహోత్సవాలు ముగిసాయి. వారం రోజులుగా జరిగిన ఈ మహోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు తనిఖీ





మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, పిల్లలకు కథలు చెబుతున్న విద్యార్థిని

వేముల : స్థానిక గ్రంథాలయంలో మంగళవారం నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వేసవి కాలంలో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైబ్రరీలో విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించడం, డ్యాన్స్, క్యారమ్స్, చెస్, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహిస్తారన్నారు. అనంతరం ఆయన గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ గంగాధర్ యాదవ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులను విజయవంతం చేయండి

సింహాద్రిపురం : గ్రంథాలయ సమ్మర్ క్యాంపులను విజయవంతం చేయాలని గ్రంథాలయాల అధికారులు గంగాదేవి, శేఖర్‌లు తెలిపారు. సింహాద్రిపురం, కోవరంగుంటపల్లె గ్రామాల్లోని గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపులో భాగంగా మంగళవారం పిల్లలకు కథలు చెప్పడం, చదవడం, ఆటలు ఆడుకుంటూ సంతోషంగా గడిపారు. పిల్లలు ప్రతి రోజు గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపును విజయవంతంగా కొనసాగిస్తామని వారు తెలిపారు.

సమస్యలను పరిష్కరించాలని రిలేదీక్షలు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న కార్మికులు

జమ్మలమడుగు : ఆర్టీసీ కార్మికులపై అధికారులు చేస్తున్న అక్రమ సస్పెన్షన్‌లను ఎత్తివేయడంతోపాటు 2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని రీజనల్ సెక్రెటరీ సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు రెండోరోజు నిరాహార దీక్షలను డిపో కార్యదర్శి శివుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో వర్కింగ్ అధ్యక్షుడు ఓబుళరెడ్డి మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయిన పదోన్నతులను వెంటనే ఇవ్వాలన్నారు. ప్రభుత్వం జీవో ఇచ్చిన ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులను మహిళలకు మంజూరు చేయాలని, పీహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని అమలు చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనాలన్నారు. నైట్ అవుట్ అలవెన్స్ రూ.150 నుంచి రూ.400 చెల్లింపులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

చక్రాయపేట : స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరంలో ఐటీఐ ప్రవేశానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రాధాకృష్ణయ్య తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండి 40 సంవత్సరాలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మే 24వ తేదీలోపు ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. లేదంటే పదవ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒక సెట్ జిరాక్ కాపీలు తీసుకు వస్తే తమ కళాశాల వద్ద నుంచే ఉచితంగా ఆన్‌లైన్ చేస్తామన్నారు. ఆన్‌లైన్ చేసుకున్న వారు మే 24 నుంచి 26 తేదీ లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025–26 సంవత్సరానికి అడ్మిషన్ల దరఖాస్తులకు ఆన్‌లైన్‌లో చేసుకోవడానికి మే 24వ తేదీ చివరి తేదీ అని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. పూర్తి వివరాలకు 9704111807, 9912946371 నంబర్లకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

తొండూరు : స్థానిక ఐటీఐ కళాశాలలో ప్రవేశాల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వై.వెంకటరెడ్డి తెలిపారు. ఆన్‌లైన్‌లో విద్యార్థులు పదవ తరగతి మార్కుల జాబితా, టీసీ, స్టడీ, కుల, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, పాసు పుస్తకాలను పొందుపరచాలని, వచ్చేనెల 24వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

వేంపల్లె : పట్టణంలోని స్థానిక శ్రీ కందుల ఓబుళరెడ్డి చారిటీస్ ఐటీఐలో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆయా ట్రేడ్‌లలో చేరడానికి 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో కోరారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ప్లంబర్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు అర్హులని, మే నెల 20వ తేదీ లోపల దరఖాస్తులు ఇస్తే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ప్లంబర్ కోర్సుకు 10వ తరగతి ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఇతర వివరాలకు వేంపల్లె ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



ఉపాధి హామీ పనుల మస్టర్లను పరిశీలిస్తున్న మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఎస్.పాలగిరి పంచాయతీలో నిర్వహించిన గ్రామ దర్శిని కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. అనంతరం నేలతిమ్మాయపల్లెలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తాగునీరు సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సర్పంచ్ విజయ్, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మీకాంత్‌రెడ్డి, రాజేష్, వెల్ఫేర్ అధికారి వెంకట ఈశ్వర్, ఇంజనీర్ అసిస్టెంటు ఆదిత్య, ఫీల్డ్ అసిస్టెంటు శివ, వార్డు మెంబరు ప్రభాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పనిచేయని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు

తొండూరు : మండల వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు పనిచేయక వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత 20 రోజుల నుంచి మండలంలోని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ల పరిధిలో ఉన్న వినియోగదారులకు ఫోన్లు చేస్తే ప్రస్తుతం ఈ నెంబర్ కవరేజీ ఏరియాలో లేదని, ఈ సేవలు అందుబాటులో లేవని, నెంబర్లపై తాత్కాలికంగా సేవలు నిలిపివేయబడ్డాయంటూ పలురకాల పొంతన లేని సమాధానాలు చెబుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ముఖ్యంగా అగడూరు, సంతకొవ్వూరు గ్రామాల పరిధిలోని సెల్ టవర్ల పరిధిలో ఉన్న వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడంలేదని, ప్రతినెలా రిచార్జి డబ్బులు వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నప్పటికి సర్వీసులు అందుబాటులో లేవని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ అధికారి వివరణకు ప్రయత్నించగా ఫోన్ అందుబాటులో లేదు.

ప్రాంతీయ బ్యాంకులు ఏపీజీబీలోకి విలీనం

సింహాద్రిపురం : ప్రాంతీయ బ్యాంకులైన ఏపీజీబీ, ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకుల వచ్చే నెల 1వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లోకి విలీనం చేయడం జరుగుతుందని, ఈ బ్యాంకుల సేవలన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సేవలందిస్తాయని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కృష్ణ కిశోర్, ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్‌లు తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీజీబీ బ్యాంకులో వారు మాట్లాడుతూ మీ యొక్క ఖాతా నెంబరు కానీ, ఐఎఫ్‌సీ కోడ్ కానీ, బ్రాంచ్ చిరునామా ప్రస్తుతానికి ఎటువంటి మార్పు లేదని, ఇప్పటికే అన్ని సేవలు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. వినియోగదారులు తమ చెక్కు బుక్కులు, పాసు పుస్తకాలు, ఏపీఎం కార్డు, డిజిటల్ సేవలు వినియోగించుకోవచ్చునన్నారు. బ్యాంకు వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందావాల్సిన అవసరంలేదన్నారు.

ప్రతి కూలీ పనులకు తప్పకుండా రావాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల(జమ్మలమడుగు) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ఉపాధి హామీ పథకంతో కూలీలకు ఉపాధి కలుగుతుందని ప్రతి కూలీ క్రమం తప్పకుండా పనులకు వస్తే వేతనం కూడా వస్తుందని ఎంపీడీఓ వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం చిర్రాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్యంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండవ రోజూ నిరాహార దీక్ష



నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న ఆర్టీసీ డిపోలో ఎన్ఎంయూ నాయకులు రెండవ రోజూ మంగళవారం నిరాహా దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షుడు సి.పి.రెడ్డి, సీసీఎల్ డెలిగేట్ రామలింగారెడ్డి, డిపో ట్రెజరర్ గంగరాజుల ఆధ్వర్యంలో ఎన్ఎంయూ నాయకులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరాహార దీక్షలు చేపట్టామన్నారు. యూనియన్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ కార్మికులు సి.పి.రెడ్డి, జీఆర్ఏ రెడ్డి, ఎంఆర్ఎం రెడ్డి, రవీంద్ర, సీజీ రెడ్డి, బీజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న ఎస్ఎంఎస్ కంపెనీ ఉద్యోగులు

వేముల : రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఎస్ఎంఎస్ కంపెనీ జీఎం శ్రీనివాసరావు, సీనియర్ మేనేజర్ రామకృష్ణ, డీజీఎం రాములు తెలిపారు. మంగళవారం మండలంలోని తుమ్మలపల్లె గ్రామ సమీపంలోని ఎస్ఎంఎస్ క్వార్టర్స్‌లో ఎస్ఎంఎస్ కంపెనీ మాజీ చైర్మన్ అభయ్ సన్ చీటీ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడంవల్ల ఇతరుల ప్రాణాలు కాపాడినట్లవుతుందన్నారు. రక్తదానంపై ఎటువంటి అపోహాలు పెట్టుకోవద్దన్నారు. ప్రతి మూడు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చునన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అనంతరం సుమారు వంద మంది ఎస్ఎంఎస్ కంపెనీ ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పవన్‌కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్‌కుమార్, అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.